


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 17-08-2025 సంపుటి : 07 సంచిక : 99 పేజీలు : 8 వెల : రూ 3-00


## రూ.11,000 కోట్లతో హైవే ప్రాజెక్టులను ప్రారంభించనున్న మోదీ




న్యూఢిల్లీ: దేశ రాజధానిలో రెండు కీలకమైన నేషనల్ హైవే ప్రాజెక్టు లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారంనాడు ప్రారంభించనున్నారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో మెరుగైన కనెక్టివిటీ, రోడ్లపై రద్దీని తగ్గించేందుకు ఈ కీలక ప్రాజెక్టులను ఉద్దేశించారు. సుమారు రూ.11,000 కోట్ల విలువైన ఈ రెండు ప్రాజెక్టులను రోహిణిలో సుమారు 12.30 గంటలకు ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం అక్కడి వేదక నుంచి ప్రసంగిస్తారు.ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ఢిల్లీ సెక్షన్, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-ఎఎ ప్రాజెక్టులు ప్రభుత్వ సమగ్ర ప్లాన్‌లో భాగంగా ప్రారంభమవుతున్నాయి. దేశరాజధానిలో మెరుగైన అనుసంధానం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో రద్దీని తగ్గించడం ఈ ప్రాజెక్టుల ముఖ్యోద్దేశం. 10.1 కిలోమీటర్ల పొడవైన ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ఢిల్లీ సెక్షన్ రూ.5,360 కోట్లతో డవలప్ చేయనున్నారు. ఈ సెక్షన్‌తో యశోభూమి, బ్లూ లైన్, ఆరెంజ్ లైన్, బిజ్‌వాసన్ రైల్వే స్టేషన్, ద్వారక క్లస్టర్ బస్ డిపోలకు కనెక్టివిటీ ఉంటుంది.కాగా, 10 కిలోమీటర్ల స్ట్రెచ్‌లో 5.9 కిలోమీటర్లు శివ మూర్తి ఇంటర్‌సెక్షన్ నుంచి ద్వారకా సెక్టార్-21కు అనుసంధానమవుతుంది. 4.2 కిలోమీటర్ల స్ట్రెచ్ ద్వారకా సెక్టార్-21 నుంచి ఢిల్లీ-హర్యానా బోర్డర్ వరకూ అనుసంధానమవుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 19 కిలోమీటర్ల పొడవైన ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే హర్యానా సెక్షన్‌ను 2024 మార్చిలో ప్రారంభించారు.

## ఉచిత బస్ టికెట్‌తో సెల్ఫీ పంపండి: లోకేశ్




అమరావతి,ఆగస్ట్16(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో మహిళా సాధికారత ఎలా ఉందో ప్రపంచానికి చాటుదామని విద్య, ఐటీ- శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఉచిత బస్సు టికెట్‌తో సెల్ఫీ దిగి ట్యాగ్ చేయాలని మహిళలను కోరారు. సురక్షితంగా.. గౌరవంతో కూడిన ఉచిత బస్సు ప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మహిళకు కల్పిస్తోందని వెల్లడించారు. మహిళలకు కల్పిస్తున్న ప్రతి ఉచిత బస్సు టికెట్ ఆశ, స్వేచ్ఛ, గౌరవంతో కూడినదని వ్యాఖ్యానించారు. ఇది స్వాతంత్ర్యం, సమానత్వంతో కల్పించిన అవకాశం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్త్రీ శక్తి, ఉచిత బస్సు ప్రయాణ పథకంతో మహిళలకు సాధికారత కల్పించడం గర్వంగా ఉందని మంత్రి లోకేశ్ అన్నారు.

## బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదన్న కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 16 : బిల్లుల ఆమోదం విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టు గడువు విధించటం అనే అంశంపై కేంద్రం స్పందించింది. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించేలా కోర్టులు వారిని నిర్దేశించవచ్చా? అన్నదానిపై సుప్రీంకోర్టు నోటీసులకు కేంద్రం బదులిచ్చింది. బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ల ఆమోదానికి గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదని కేంద్రం.. సుప్రీంకోర్టుకు విన్నవించింది. కొన్ని అంశాల్లో కోర్టులు జోక్యం చేసుకుంటే రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉందని కేంద్రం తెలిపింది.బిల్లుల అంగీకారం అంశంలో కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంది. బిల్లులపై గడువు విధింపుతో రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కూడా కేంద్రం అభిప్రాయపడింది.ఆ రెండు స్థానాలు ప్రజాస్వామ్య పాలనకు ఉన్నత ఆదర్శాలు అని చెప్పిన కేంద్రం.. వారి విధుల్లో ఏవైనా లోపాలు ఉంటే న్యాయ జోక్యాల కంటే.. రాజ్యాంగపరమైన యంత్రాంగం ద్వారా సరిదిద్దాలని సుప్రీంకు కేంద్రం తెలిపింది.

## బలహీనపడ్డ అల్పపీడనం



విశాఖపట్నం,ఆగస్ట్16: అల్పపీడనం బలహీనపడడంతో ఆంధ్రాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయి. దీంతో జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. ఒడిశా-ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య అల్పపీడనం బలహీనపడిందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. విశాఖ మీదుగా తూర్పు మధ్య బంగాళాఖాతంలో రుతుపవనాల ద్రోణి కొనసాగుతోందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో ఆదివారం ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలో చాలా చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపారు.పోర్టుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు- చెప్పారు. ఈ రోజు పార్వతీపురం మన్యం జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్, ఆదివారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయనున్నట్లు- విశాఖ వాతావరణ కేంద్రం అధికారి తెలిపారు.

## రాహుల్ విమర్శలకు స్పందించనున్న ఇసి

### మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించే ఛాన్స్

### రాహుల్ విమర్శలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ,ఆగస్ట్16 రాహుల్ విమర్శలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధం అవుతోంది. కర్ణాటక, బిహార్ సహా దేశంలో అనేక చోట్ల ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా విపక్ష నేతలు ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విమర్శలకు చెక్ పెట్టేందుకు ఈసీ సిద్ధమైనట్లు- తెలుస్తోంది. ఓట్ల చోరీ ఆరోపణల వేళ.. ఆదివారం సమావేశం నిర్వహించనున్నట్లు- సమాచారం. బిహార్‌లో రాహుల్ గాంధీ 'ఓటు- అధికార యాత్ర'ను ప్రారంభించనున్న రోజే ఈ సమావేశం ఏర్పాటుకు ముందుకు రావడం గమనార్హం. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే సమయంలో తప్ప.. ఇతర అంశాలపై ఎన్నికల సంఘం అధికారికంగా విలేకరుల సమావేశం నిర్వహించడం చాలా అరుదు. ఆదివారం నిర్వహించనున్న మీడియా సమావేశం వెనుక అసలు కారణాన్ని వెల్లడించనప్పటికీ.. కొంతకాలంగా ఈసీపై వెల్లువెత్తుతున్న ఆరోపణలకు సంబంధించినదని అధికారులు తెలిపారు. ప్రతిపక్షాలు 'ఓటు- చోరీ' అనే పదాన్ని పదే పదే వినియోగించడాన్ని ఈసీ ఇప్పటికే తప్పుపట్టింది. తప్పుడు కథనాలకు కారణమయ్యే ప్రచారాన్ని చేసే బదులు ఆధారాలు చూపించాలని పేర్కొంది.బిహార్‌లో ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ, ఓట్ల చోరీపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్లు- చోరీకి గురయ్యాయని రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించారు.

## రజినీ సినీ ప్రయాణం.. పవన్ కల్యాణ్ రియాక్షన్

అమరావతి, ఆగస్టు 16: సూపర్ స్టార్ రజినీకాంత్ సినీ రంగ ప్రవేశం చేసి.. 50 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తనదైన శైలిలో స్పందించారు. సినీ జీవితంలో స్వర్ణోత్సవం చేసుకుంటున్న సూపర్ స్టార్ రజినీకాంత్ గారికి ఈ సందర్భంగా ఆయన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తరాలు మారుతున్నా రజనీకాంత్ అంటే.. సినీ ప్రియుల్లో ఆ ఆనందోత్సాహాల వన్నె తగ్గలేదని చెప్పారు. ఆ స్థాయి అభిమానులను దక్కించుకున్న అగ్రశ్రేణి కథానాయకుడు రజనీకాంత్ నటుడిగా అయిదు దశాబ్దాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారని వివరించారు.వెండి తెరపై 'సూపర్ స్టార్ రజిని' అని టైటిల్ కనిపించగానే థియేటర్ ఏ విధంగా మారుమోగుతుందో పలుమార్లు తాను చెన్నైలో చూశానని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. నటుడిగా ఆయన ప్రయాణం ఎందరికో స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ప్రతినాయక పాత్ర పోషించినా.. కథానాయకుడిగా మెప్పించినా రజినీకాంత్ తనదైన స్టైల్‌ను చూపించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేశారంటూ ప్రశంసించారు.

## వైఎస్ భారతి కూడా ఫ్రీ బస్సులో ప్రయాణించవచ్చు..

### మాజీమంత్రి కీలక వ్యాఖ్యలు



అమరావతి: ఆడబిడ్డలను వృద్ధిలోకి తీసుకురావాలన్న సిద్ధాంతమే తెలుగుదేశం పార్టీ విధానమని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఛైర్ పర్సన్, మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. ఆనాడు ఎన్టీఆర్ మహిళల హక్కుల కోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు డ్వాక్రా అనే విత్తనం వేసి.. నేడు కోటి మంది మహిళలు వాళ్ల కుటుంబాలకు ఆసరగా నిలిచేలా చేశారని ఆమె కొనియాడారు.మహిళలకు అవకాశాలు కల్పిస్తే ఏదైనా చేస్తారని, అద్భుతాలు సృష్టిస్తారని పీతల సుజాత ధీమా వ్యక్తం చేశారు. మహిళల కోసం స్త్రీ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు రాష్ట్ర మహిళల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి మహిళలకు ఇచ్చిన కానుక స్త్రీ శక్తి పథకమని పేర్కొన్నారు. రాఖీ పండుగలా ఈ స్త్రీ శక్తి పథకాన్ని కూడా మహిళలంతా చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఇలాంటి మంచి పథకాన్ని ప్రవేశపెడితే వైసీపీ పేటీఎం బ్యాచ్ వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి పథకంపై విమర్శలు చేయడం వైసీపీ నాయకుల దిగజారుడు తనానికి నిదర్శనమని విమర్శించారు.వైఎస్ భారతి కూడా జీరో ఛార్జీతో పులివెందుల నుంచి అమరావతికి రావొచ్చని సుజాత చెప్పుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే చంద్రబాబు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం అందజేశామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పి.. ఒక్కరికే పరిమితం చేశారని ఆరోపించారు. అమరావతి అభివృద్ధి, పోలవరం నిర్మాణం, రహదారుల విస్తరణ వంటి అనేక కార్యక్రమాలను వేల కోట్లతో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాబోయే నాలుగేళ్లలో మరిన్ని పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తామని సుజాత స్పష్టం చేశారు.




# సంపాదకీయం

ఆదివారం 17-08-2025

## ఇక జియో పొలిటికల్ షిఫ్ట్..

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు అంటూ ఉండరంటారు కదా.. అయితే ఇది కొన్ని సందర్భాల్లో దేశాలకూ వర్తిస్తుంటుంది. ప్రత్యర్థిగా భావిస్తున్న దేశాలతోనే జట్టుకట్టే పరిస్థితి ఉండొచ్చు. ఇప్పుడు భారత్ ? చైనా బంధం చూస్తుంటే ఇదే నిజమనిపిస్తోంది. ఓవైపు ట్రంప్ దూకుడు భారత్, చైనాకు చాలానే కలిసి వస్తోంది. జియోపొలిటికల్ షిఫ్ట్ అనేది ఒకటి ఉంటుంది. ట్రంప్ కారణంగా ఇది వర్కవుట్ అవుతోంది. భారత్ చైనా మధ్య స్నేహబంధం. ఒక నమ్మకం సరికొత్త బంధానికి పునాది వేస్తుంది. ఒక అవకాశం.. సత్సంబంధాలను పెంచుతుంది. ఒక అవసరం కలిసి నడిచేలా చేస్తుంది. ఇది ఇప్పుడు భారత్ చైనాకు వర్తిస్తుంది. ఎందుకంటే 2020లో గాల్వన్ లోయలో ఘర్షణ తర్వాత కథ అంతా మారిపోయింది. దూరం పెరిగింది. అయితే ఆ దూరం ఎప్పుడూ అలాగే ఉండదు కదా. ఇటీవలి పరిస్థితులు కలిసి వచ్చాయి. రెండు దేశాల మధ్య మళ్లీ కొత్తబంధం చిగురించేలా చేశాయి. భారత ఉత్పత్తులపై ట్రంప్ 50 శాతం టారిఫ్ లు విధించిన తర్వాత ఈ రెండు దేశాలు దగ్గరవుతున్నాయని ఇప్పుడు అనుకుంటున్నారు. అయితే మార్చిలో చైనాపై 20 శాతం ట్రంప్ టారిఫ్ లు విధించినప్పుడే చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. అమెరికా ఓవరాక్షన్ కు చెక్ పెట్టేందుకు, పవర్ పాలిటిక్స్ ను అడ్డుకునేందుకు కలిసి పని చేద్దామన్నారు. అప్పటి నుంచే భారత్ ? చైనా మధ్య పరిస్థితులు అనుకూలించడం మొదలైంది. చెప్పాలంటే మొదట ఒక మెట్టు చైనానే దిగింది. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి రాక. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఢిల్లీకి వస్తున్నారు. జాతీయ భద్రతా సలహాదారు దోవల్ తో భేటీ అవుతారు. ఈనెల 31న ప్రధాని మోడీ చైనా పర్యటన కంటే ముందుగానే ఈ పరిణామం చోటు చేసుకుంటుండడం ఆసక్తికరంగా మారుతోంది. ఎందుకంటే మాట్లాడుకునేవి చాలా ఉన్నాయి. పరిష్కరించుకునేవీ ఉన్నాయి. సో ఇటీవలి కాలంలో భారత్ చైనా ప్రతినిధులు, ప్రభుత్వ వర్గాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయి. రాజకీయంగా పరస్పర విశ్వాసం పెంచుకోవడం, సహకారాన్ని విస్తరించడం ఇవన్నీ రెండు దేశాల మధ్య బంధాన్ని మరో లెవెల్ కు తీసుకెళ్లేలా కనిపిస్తున్నాయి ట్రంప్ టారిఫ్ లకు చెక్ పెడుదామని చైనా ముందుకు రావడం, ప్రధాని మోడీ ఏడేళ్ల తర్వాత చైనాకు వెళ్లాలని డిసైడ్ అవడం, సరిహద్దు వాణిజ్యం మళ్లీ ప్రారంభించాలని అనుకోవడం, బార్డర్ లో పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించడం, డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభించాలనుకోవడం, చైనీస్ పౌరులకు టూరిస్టుల వీసాల మంజూరుపై ముందడుగు పడడం, చైనా కంపెనీల పెట్టుబడుల నిబంధనలను సడలించాలనుకోవడం ఇవన్నీ కీలక పరిణామాలుగా కనిపిస్తున్నాయ్. సరిహద్దు వాణిజ్యం మళ్లీ మొదలు పెట్టేలా చర్చలు. ఓవరాల్ గా చూస్తే భారత్ చైనా మధ్య సరిహద్దు వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాల్లో మెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఏర్పడిన ఉద్రిక్తతల నుంచి రిలీఫ్ కనిపిస్తోంది. ఈ సంబంధాలు పెరగడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలు, భారత్‌పై విధించిన అధిక టారిఫ్ లు కీలకంగా మారాయి. ఫస్ట్.. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత నిలిపేసిన సరిహద్దు వాణిజ్యాన్ని పునఃప్రారంభించేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఈ ట్రేడ్ ఉత్తరాఖండ్ లిపులేఖ్ పాస్, హిమాచల్ ప్రదేశ్ షిప్కి లా పాస్, అలాగే సిక్కిం నాథు లా పాస్ ఇలా మూడు హిమాలయన్ సరిహద్దుల ద్వారా జరుగుతుంది. ఈ సరిహద్దు వాణిజ్యం విలువలో చిన్నదైనప్పటికీ రెండు దేశాల మధ్య సామాజిక ఆర్థిక సంబంధాలను మెరుగుపరచడంలో కీ సిగ్నల్ గా ఉంది. సో ఇది త్వరలో ప్రారంభించాలనుకోవడంపై చైనా రియాక్ట్ అయింది. ఈ వాణిజ్యంతో సరిహద్దు ప్రాంత వాసుల లైఫ్ క్వాలిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నది చైనా. 2020కి ముందున్న పెట్రోలింగ్ విధానం పునరుద్ధరణ. భారత్ చైనా మధ్య దౌత్యపరమైన పురోగతి కూడా కనిపిస్తోంది. 2024 అక్టోబర్‌లో కుదిరిన ఒప్పందంతో 2020కి ముందు ఉన్న పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించారు. ఐదేళ్ల తర్వాత ఇదొక కీలక ముందడుగుగా మారింది. అటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 31న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ ? ఎస్‌సీఓ సమ్మిట్ కోసం చైనాకు వెళ్లనున్నారు. ఏడేళ్ల తర్వాత చైనా పర్యటనకు మోడీ వెళ్తుండడం ఇదే తొలిసారి. ఈ టైంలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీ జరగనుంది. అటు 2020 నుండి నిలిపేసిన డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభం కానున్నాయి. రెడీగా ఉండాలని విమానయాన సంస్థలకు కేంద్రం సూచించింది కూడా. చైనాతో భారత్‌కు 85 బి. డాలర్ల వాణిజ్య లోటు. సో ఈ ప్రయత్నాలన్నీ ఆర్థిక దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక ముందడుగుగా మారుతాయి. వాణిజ్యం, చర్చలను తిరిగి ప్రారంభించడం ద్వారా రెండు దేశాలు ఉద్రిక్తతలను తగ్గించడానికి సహకారాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడనున్నాయి. 2023-24లో భారత్‌కు చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ద్వైపాక్షిక వాణిజ్యం 118.4 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అయితే ఇండియా 85 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును ఎదుర్కొంటోంది. దీనిని తగ్గించేందుకు చైనాలో మన మెడిసిన్స్, అలాగే వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ యాక్సెస్‌ను పెంచాలని భారత్ కోరుతోంది.

# పాకిస్థాన్‌లో మెరుపు వరదలు..

### 48 గంటల్లో 321 మంది మృతి.. షాకింగ్ వీడియోలు!

న్యూఢిల్లీ: దాయాది దేశం పాకిస్థాన్ ను భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. గత రెండు రోజులుగా పాక్ వ్యాప్తంగా కుంభవృష్టి కురుస్తోంది. ఈ వర్షానికి మెరుపు వరదలు సంభవించాయి. నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లు, ఇళ్లను వరద ముంచెత్తింది. భారీ వర్షానికి పలు చోట్ల ఇళ్లు, చెట్లు కూలిపోయాయి. కుండపోత వర్షాల కారణంగా అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. రోడ్లు కొట్టుకుపోయాయి. ఈ కుంభవృష్టి కారణంగా రెండు రోజుల్లోనే దాదాపు 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర పాకిస్థాన్‌లో భారీ వర్షాలకు సంభవించిన ఆకస్మిక వరదలకు గత 48 గంటల్లో కనీసం 321 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు శనివారం తెలిపారు. అత్యధికంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లోనే 307 మంది మరణించినట్లు ప్రావిన్షియల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ తెలిపింది. వంద మందికిపైగా గాయపడ్డారు. అనేక మంది వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. గల్లంతైన వారి కోసం రెస్క్యూ టీమ్స్ గాలింపు చేపడుతోంది. వరదలకు సంబంధించిన షాకింగ్ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు రానున్న రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పాక్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ హెచ్చరికలతో అప్రమత్తమైన అధికారులు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.



# చషోటి గ్రామాన్ని సందర్శించిన జమ్ము కశ్మీర్ సీఎం..

### బాధితులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటన

న్యూఢిల్లీ: జమ్ము కశ్మీరులోని కిష్టార్ జిల్లాలో గురువారం కురిసిన కుండపోత వర్షానికి వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో 60 మందికిపైగా మరణించగా 100 మందికిపైగా గాయపడ్డారు. చషోటీ గ్రామంలో గురువారం వచ్చిన ఆకస్మిక వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా చషోటి గ్రామాన్ని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సందర్శించారు. అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు బాధిత కుటుంబాలకు జమ్ము కశ్మీర్ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. విపత్తులో మరణించిన కుటుంబాలకు రూ. 2లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ. లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. స్వల్పంగా గాయపడిన వారికి రూ. 50 వేలు అందించనున్నట్లు తెలిపింది. ఇక ఈ ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ. లక్ష, తీవ్రంగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ. 50 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న నిర్మాణాలకు రూ. 25 వేలు చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కిష్టార్ జిల్లాలో గురువారం కురిసిన ఆకస్మిక కుంభవృష్టికి ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లు సహా దాదాపు 65 మంది ప్రాణాలు కోల్పోయారు. 160 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో 38 మంది పరిస్థితి విషమంగా ఉన్నది. మరో 200 మంది వరకు గల్లంతయ్యారు. మారుమూల పర్వత ప్రాంతంలోని ఓ గ్రామంపై మేఘ విస్ఫోటం సంభవించి గ్రామాన్ని వరద ముంచెత్తినట్లు అధికారులు తెలిపారు. గల్లంతైన వారిని రక్షించేందుకు సహాయక బృందాలు గాలిస్తున్నాయి. మచైల్ మాతాదేవి యాత్రకు వెళ్లే మార్గంలో వాహనాలు వెళ్లగల చివరి గ్రామం చషోటీని కుంభవృష్టి ముంచెత్తినట్లు అధికారులు చెప్పారు. హిమాలయ పర్వత శ్రేణుల్లో కొలువై ఉన్న చండీమాత ఆలయంలో జరుగుతున్న వార్షిక మచైల్ మాత యాత్రలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు చషోటీ గ్రామానికి చేరుకున్నపుడు ఈ ఘటన జరిగింది.



# కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారు..

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ : తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కుట్ర వెనుక కాంగ్రెస్, బీజేపీ ఉన్నాయని ఆర్ఎస్పీ ఆరోపించారు. తెంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం పట్ల సంచలన ఆధారాలను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బయటపెట్టారు. 2023వ సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన సాయంత్రం 6:20 గంటలకు, మేడిగడ్డ పిల్లర్ల వద్ద భారీ శబ్ధాలు వచ్చాయని మేడిగడ్డ అసిస్టెంట్ ఇంజనీర్ రవికాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు 2023 సంవత్సరం అక్టోబర్ 22వ తేదీన మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ ఫిర్యాదు చేశారు. ఇంతవరకు ఆ ఎఫ్ఐఆర్ పట్ల చర్యలు ఎందుకు తీసుకోలేదు? అని ఆర్ఎస్పీ నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చే కుట్ర చేశారు. ప్రాజెక్టు పిల్లర్‌కు పగుళ్లు రావు.. క్రస్ట్ గేట్లకు వస్తే రావొచ్చేమో. ఇంటి నిర్మాణానికి సంబంధించిన పిల్లర్లకు కూడా పగుళ్లు రావు.. ఉష్ణోగ్రత తేడాతో గోడలకు పగుళ్లు వస్తాయి కానీ కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక్కటే 20వ నెంబర్ పిల్లర్‌కి క్రాక్ వచ్చిందంటే, కచ్చితంగా బ్లాస్ట్ జరిగిందనే అనుమానాలు ఉన్నాయని ఆర్ఎస్పీ అనుమానం వ్యక్తం చేశారు. అసలు ఏమాత్రం వరద లేని సమయంలో మేడిగడ్డ బ్యారేజీ ఎలా కుంగిపోయింది.. అది కూడా ఒక్క పిల్లరే ఎలా కుంగిపోతుంది. 2022లో రికార్డు స్థాయిలో వరదలు వచ్చినా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు తట్టుకున్నాయి. మేడిగడ్డలో ఒక్క పిల్లర్ మాత్రమే ఎందుకు కుంగిపోయింది. కిషన్ రెడ్డి లేఖ రాయగానే ఎన్‌డీఎస్ఏ వచ్చింది. ఉత్తరాఖండ్‌లో మొత్తం డ్యామ్ కొట్టుకునిపోతే ఎందుకు ఎన్డీఎస్ఏ అక్కడికు వెళ్ళలేదు. మేడిగడ్డ వద్ద పేలుళ్ల శబ్దాలపై ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడటంలేదు. మహదేవ్‌పూర్ పోలీసులు వెంటనే విచారణ చేసి ఉండాలి. అసాంఘిక శక్తులు రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇంకా ఎవరైనా అనేది తేల్చాలి. ఈ ముగ్గురి మొబైల్ ఫోన్స్ డేటా చెక్ చేస్తే వెంటనే దొరికేవాళ్ళు . భూపాలపల్లి పోలీసులు అప్పుడు వెంటనే పిల్లర్ల శాంపిల్స్, భూమి శాంపిల్, అక్కడ ఉండే మీటర్ రీడింగ్స్, సిస్మిక్ డేటా, కాల్ డీటెయిల్స్ తీసుకొని ఉండాల్సింది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు. పిల్లర్లకు ఎక్కడా క్రాక్ రాదని ఇంజనీరింగ్ నిపుణులు చెప్తున్నారు. దీని వెనుక రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కిషన్ రెడ్డి ఉన్నారా లేదా అనేది సిట్ ఏర్పాటు చేసి తేల్చాలి. అసలు అక్కడ చిన్నస్థాయిలో ఏమైనా భూకంపాలు వచ్చాయా లేదా అనేది తేల్చాలి. పేలుళ్ల కోణంలో ఎందుకు విచారణ జరగలేదు. పేలుళ్లపై ఇప్పటివరకు ఎవరి స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదు అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు




# కామన్ సెన్స్ ఉంటే రైతుల బాధలు తీర్చండి.. సీఎం రేవంత్‌కు నిరంజన్ రెడ్డి చురకలు



హైదరాబాద్ : కామన్ సెన్స్ గురించి, భాష గురించి స్వాంతత్ర్య దినోత్సవం సంధర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడాల్సిన అవసరం ఏముంది? దాని గురించి ఎవరికి ఉపయోగం? అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. మరి కామన్‌సెన్స్ ఉంటే రైతుల బాధలు తీర్చండి అని సీఎంకు నిరంజన్ రెడ్డి చురకలంటించారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆంగ్లం రాకపోవడం మూలంగానే సమాజంలోని పలు వర్గాలు వెనకబడ్డాయి అన్న దానికి అంగీకరించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. ఈ ప్రభుత్వానికి కామన్ సెన్స్ ఉంటే రైతుల బాధలు ఎలా తీరుస్తారో స్పష్టంచేయండి. 50 సార్లు ఢిల్లీకి వెళ్లడం మూలంగా ఏం సాధించుకుని వచ్చారు? కనీసం యూరియా తేలేకపోయారు. పరోక్ష సహకారం అందించే బీజేపీ ఎంపీలు కూడా యూరియా గురించి ఏం మాట్లాడలేదు. యూరియా తెచ్చే ప్రయత్నం కూడా చెయ్యరు అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల మైత్రి జోరుగా నడుస్తున్నది. దీనిని ఎవరూ కాదనలేరు. కాళేశ్వరం, పోలవరం, బనకచర్ల విషయంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరులు గమనించండి. బనకచర్ల విషయంలో కనీసం డీపీఆర్ లేకుండానే కేంద్రం లోన్ ఇవ్వడానికి కేంద్రం సిద్దమయింది. దేశంలోని ఏ రాష్ట్రంలో ఎక్కడ ప్రాజెక్టు నిర్మించినా అది ఈ దేశ ప్రజల సంపద. ఐదేండ్లు ఫలితాలు ఇచ్చిన కాళేశ్వరాన్ని వినియోగించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను కిందకు వదిలేస్తూ పరోక్షంగా ఏపీ ప్రాజెక్టులకు సహకరిస్తున్నది. ఐదేళ్లు ఫలితాలు ఇచ్చిన కాళేశ్వరాన్ని అక్కడ కట్టాల్సి లేకుండే అనడమే మూర్ఖత్వం. 90 శాతం పూర్తయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు..? అని నిరంజన్ రెడ్డి నిలదీశారు.

# ముంబైలో భారీ వర్షం..

### కొండచరియలు విరిగిపడి ఇద్దరు మృతి



మహారాష్ట్ర ముంబై ని భారీ వర్షం అతలాకుతలం చేసింది. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నగరం మొత్తం స్తంభించిపోయింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి ముంబైలోని విక్రోలి లో వర్ష నగర్ ప్రాంతంలోని జన్కల్యాన్ సొసైటీలో శనివారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడ్డాయి భారీగా మట్టి, రాళ్లు ఓ గుడిసెపై పడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. తెల్లవారుజామున 2:39 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ముంబై అగ్నిమాపక దళం (ఓఈః), స్థానిక పోలీసులు, రెస్క్యూ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఇక భారీ వర్షానికి సియోన్, కుర్లా, చెంబూర్, అంధేరి సహా నగరం మొత్తం జలమయమైంది. సియోన్‌లోని కొన్ని ప్రాంతాల్లో మోకాలి లోతులో నీరు నిలిచిపోయింది. వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేపై వాహనాలు నిలిచిపోయాయి. భారీగా వర్షపు నీరు చేరడంతో అంధేరి సబ్‌వేని అధికారులు మూసివేశారు. విక్రోలిలో 21 గంటల్లో 248.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు ముంబై ఎయిర్‌పోర్ట్‌లో విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. పలు విమానాలు ఆలస్యం కాగా, మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నారు. మరోవైపు భారత వాతావణ శాఖ ముంబై నగరానికి అలర్ట్ జారీ చేసింది. పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ మేరకు ముంబై, రాయ్‌గఢ్‌లకు రెడ్ అలర్ట్ ఇచ్చింది.

# శృంగేరి శారదంబా అలయంలో ఘనంగా శ్రీమంతం వేడుకలు

ఖమ్మం ఖమ్మం నగరంలోని శృంగేరి శారదాంబ ఆలయంలో అమ్మవారికి శ్రీమంతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శారదా మాతకు శ్రావణమాసంలో ఇలా శ్రీమంతం చేయడం ద్వారా సంతానం లేని వారికి సంతానం కలుగుతుంది అని భక్తుల నమ్మకం . శంకరమఠంలోని శృంగేరి శారదాంబ అమ్మవారు సంతానం లేని వారికి సంతానం కల్పిస్తుంది . అమ్మ ఆదేశులకోసం శ్రావణమాసం లో జరిగే ఈ కార్యక్రమానికి సంతానం లేని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పాకిస్థానీ ఫహద్ కు రిమాండ్.. జైలుకు తరలింపు

హైదరాబాద్ : బంజారాహిల్స్ లో పట్టుబడ్డ పాకిస్థానీ ఫహద్ ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచలగూడ జైలుకు తరలించారు. భారత్ పౌరసత్వం ఎలా పొందాడని వివరాలు లంగర్ హౌస్ పోలీసులు సేకరిస్తున్నారు. ఫహద్ కుటుంబసభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. పాకిస్థాన్ పంపించేందుకు హైదరాబాద్ పోలీసుల ప్రయత్నం. ఎంతమందిని ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేశాడనే వివరాలు కుడా సేకరిస్తున్నారు.

# వైసీపీ వాళ్లు చెప్పారు... టీడీపీ వాళ్లు చేసి చూపించారు

విజయవాడ, ఆగస్టు 16, పులివెందులలో జెడ్పీ ఎన్నికల్లో ఘోర పరాభవానికి కుప్పంలో లింక్ ఉందా..అప్పటి అత్యుత్సాహమే ఇప్పటి ఓటమికి కారణమైందా అన్నవిశ్లేషణలు వస్తున్నాయి. 2021 స్థానిక ఎన్నికల్లో కుప్పంను కొల్లగొట్టి.. వై నాట్ కుప్పం అంటూ చేసిన అతి చర్యలవల్లే ఇప్పుడు జగన్ పార్టీకి ఈ పరిస్థితి వచ్చిందని తెలుగుదేశం అంటోంది. వై నాట్ 175 అంటూ అప్పట్లో జగన్ కుప్పం ను కూడా కలుపుకునే అన్నారు. దానికి ప్రతిగా చంద్రబాబు వైనాట్ పులివెందుల అంటూ సవాల్ చేశారు.అప్పట్లో జగన్ అయినా.. చంద్రబాబు అయినా కూడా ముఖాముఖీగా వాళ్ల నియోజకవర్గాలను కూడా ఓడిస్తామని సవాల్ చేశారు. అది జరగలేదు కానీ.. ఏడాది తర్వాత పులివెందులలో వైసీపీని టీడీపీ చావు దెబ్బ కొట్టింది. వైఎస్ కుటుంబానికి ఓటమంటే తెలియని పులివెందులలో అదీ ఆ మండలంలో వైసీపీని డిపాజిట్ కూడా రాకుండా ఓడించడం వెనుక చాలా సంగతే ఉంది. క్యాడర్ కష్టపడిందా.. అధికారంతో అక్రమాలు చేసిందా.. ప్రత్యర్థులను భయపెట్టిందా.. లేక జగన్‌పైనే వ్యతిరేకత వచ్చిందా.. ఇలా ఎన్నిరకాల వాదనలున్నా.. సరే మొత్తానికి ఆన్ రికార్డ్ టీడీపీ అక్కడ గెలిచింది. దీనికి కారణం కుప్పం..సాధారణంగా ముఖ్యమంత్రి అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీలు అంత దృష్టి పెట్టవ్.. వాళ్లు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న నేత నియోజకవర్గంలో రాజకీయ ఫిరాయింపులని ప్రోత్సహించడం లాంటివి కూడా చేయరు.. అదంతా వైఎస్ చంద్రబాబు జమానా వరకూ సాగింది. ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. 2017లో కడప జిల్లాలో బీటెక్ రవిని స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా టీడీపీ గెలిపించుకోగలిగింది. చంద్రబాబు తన జిల్లాలో రాజకీయం చేస్తే.. జగన్ ఏకంగా ఆయన నియోజకవర్గంలోనే చేశారు. 2021 స్థానిక ఎన్నికల్లో కుప్పం మునిసిపాలిటీతో పాటు.. నియోజకవర్గంలోని అన్ని జెడ్పీటీసీలను.. ఎంపీటీసీలను కూడా వైసీపీ కైవసం చేసుకుంది.పులివెందులో టీడీపీ దౌర్జన్యాలు చేసిందని.. ఓటర్లను బయటకు రానివ్వకుండా రిగ్గింగ్ చేసుకుందని వైసీపీ ఆరోపిస్తోంది. మరి ఆ రోజు.. కుప్పంలో జరిగింది కూడా అదే. కుప్పం మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయి. జర్నలిస్టులను కూడా కొట్టారు. ఆ నియోజకవర్గం మొత్తం టీడీపీ బయటకు రాకుండానే చేశారు.కుప్పంలో చంద్రబాబు అప్పటికే 7సార్లు ఎమ్మెల్యే. ప్రత్యర్థి పార్టీకి అంతగా పట్టు లేదు. కానీ 2021లో కుప్పం పరిధిలోని 89 పంచాయతీల్లో వైసీపీ 74చోట్ల గెలిచింది. నియోజకవర్గంలోని 4 మండలాలు వైసీపీ పరం అయ్యాయి. ఇక నాలుగు జెడ్పీటీసీ స్థానాల్లో అయితే.. ఏకంగా 17వేలు, 16వేలు, 11 వేల చొప్పున మెజార్టీలు వచ్చాయి. 68 ఎంపీటీసీ స్థానాల్లో 63 వైసీపీవే..! పెద్దిరెడ్డి కుప్పంలోనే క్యాంప్ వేసి మరీ ఎన్నికల్లో ఈ రిజల్ట్ తెప్పించారు. "చంద్రబాబు ఇలాకాలో 90శాతానికి పైగా సీట్లు అప్పట్లో వైసీపీ తన ఖాతాలో వేసుకుంది. మరిప్పుడు ఒక్క చోట ఓడిపోతేనే గగ్గోలు పెడుతున్నారు ఎందుకు" అంటూ టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. కుప్పంలో గెలుపొందిన వైసీపీ అక్కడితో ఆగలేదు.. చాలా అత్యుత్సాహం ప్రదర్శించింది. చంద్రబాబు ఓడిపోయాడని.. కూలిపోయాడని... ప్రచారం ప్రారంభించింది. జెడ్పీ ఓట్ల లెక్కల ప్రకారం చంద్రబాబు కంటే 62వేల ఓట్లు మెజార్టీ వచ్చిందని చెప్పింది. దీనికి కుప్పం మునిసిపాలిటీమెజార్టీ అదనం.. అది కూడా కలుపుకుంటే 75వేల ఓట్లు మెజార్టీ...వైనాట్ 175 స్లోగన్‌కు అదే బీజం కూడా..! అప్పట్లో నియోజకవర్గం మొత్తం కొల్లగొట్టిన వైసీపీ ఇప్పుడు రెండు జెడ్పీటీసీ ఓటములను జీర్ణించుకోలేకపోయింది.వైసీపీ లెక్క ప్రకారం చంద్రబాబుకు అప్పటికే ఉన్న మెజార్టీని దాటుకుని 75వేలు ఓట్లు పెరిగాయంటే.. దాదాపు లక్ష ఓట్లు టర్న్ అయినట్లు. కానీ 2024 రిజల్ట్ మాత్రం వేరు. చంద్రబాబు తనకు అంతకు మందు వచ్చిన దానికంటే.. 18వేలు పెంచుకున్నారు. మరి ఈ లక్ష ఓట్లు ఏమయ్యాయి. ఇక జగన్ తనకు ఉన్న 90వేల మెజార్టీ నుంచి 60వేలకు పడిపోయారు. దీనిని బట్టే పులివెందులలో జగన్ ప్రాభవం తగ్గినట్లు కనిపిస్తోంది. అప్పట్లో కుప్పం ఒక్కదానితోనే ఆగలేదు.. జిల్లా మొత్తంలో 65 జెడ్పీ స్థానాలుంటే.. 65 వైసీపీనే గెలిచింది. ఇందులో ఏకంగా 33 స్థానాలు ఏకగ్రీవాలయ్యాయి. ఇలాంటి పరిస్థితి ఎంజాయ్ చేసిన వైసీపీ ఇప్పుడు రెండు ఓటములను తీసుకోలేకపోతోంది.కుప్పంలో జరిగిన హంగామాను తెలుగుదేశం చాలా సీరియస్‌గా తీసుకుంది. అందుకే పులివెందులను టార్గెట్ చేసింది. జగన్ నేరుగా ఓడించడం సాధ్యం కాదు అని తెలిసి.. అక్కడ దెబ్బకొట్టడానికి తగిన అవకాశం కోసం చూసింది. మరో ఏడాదిలోనే స్థానిక ఎన్నికలున్నాయి. మామూలుగానే టీడీపీ స్థానిక ఎన్నికలను వేగంగా పెట్టదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపఎన్నిక పెట్టడం.. అది కూడా పులివెందులలో పెట్టడం అంటే ఓ రకంగా రిస్క్ తీసుకున్నట్లు అర్థం. లోకేష్ నేరుగా ఇన్వాల్వ్ అయి... పులివెందుల ఎన్నికకు చొరవ చూపినట్లు తెలుస్తోంది. కచ్చితంగా గెలిచి తీరాలన్న టాస్క్ ఇచ్చిన తర్వాత.. గెలిచి తీరతామన్న నమ్మకంతోనే ముందుకెళ్లారు. జగన్‌ను మొన్నటి ఎన్నికల్లో ఎదుర్కొన్న బీటెక్‌రవి భార్య లతా రెడ్డిని రంగంలోకి దింపారు. గురి చూసి వైఎస్ కుటుంబం కుంభస్థలాన్ని కొట్టారు.కుప్పంలో తెలుగుదేశం నాలుగు చోట్ల కలిపి 20వేల ఓట్లు అయినా సాధించింది. కానీ.. పులివెందులలో వైఎస్సార్సీపీకి డిపాజిట్ రాలేదు. 7వేలకు పైగా ఓట్లు పోలైతే... 683 ఓట్లు మాత్రమే వచ్చాయి. తెలుగుదేశం అసలు ఓటర్లను ఇళ్లనుంచి బయటకు రానివ్వకుండా మొత్తం రిగ్గింగ్ చేసుకుందని వైసీపీ ఆరోపణ. చాలా చోట్ల దొంగ ఓట్లు వేసిన ఆధారాలను ఆ పార్టీ అధినేత బయటపెట్టారు. జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు నుంచి ఓట్లు వేశారని చెప్పారు. ఇవే తరహా ఆరోపణలు కుప్పం ఎలక్షన్‌లోన వచ్చాయి. మేం రిగ్గింగ్ చేసుకుంటే.. "ఓటింగ్ 74శాతమే ఎందుకవుతుంది.. 90శాతం చేసుకునే వాళ్లం కదా.." అని టీడీపీ అంటోంది.తెలుగుదేశం దూకుడుగా వెళ్లినట్లు కనిపిస్తున్నా.. కొన్ని చోట్ల వైసీపీ ఓటర్లు కూడా ఓటింగ్‌కు నిరాసక్తత చూపారు. కొన్నేళ్లుగా నియోజకవర్గంలో వైఎస్ అవినాష్‌రెడ్డి హవానే సాగుతోంది. జగన్ సొంత నియోజకవర్గంపై పెద్దగా దృష్టి సారించడం లేదు. వైఎస్ అవినాష్‌పై కోపం ఉన్న వాళు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇలా చేస్తే అయినా జగన్‌కు విషయం అర్థం అవుతుంది అనుకున్న వాళ్లు కూడా ఉన్నారు. ఆ వీడియోలు కూడా బయటకు వచ్చాయి. సరే ఏదైతే ఏంటి.. మొత్తానికి మొట్టమొదటి సారి తెలుగుదేశం పులివెందులలో జెండా ఎగరేస్తే.. 45ఏళ్ల తర్వాత వైఎస్ కుటుంబం ఓటమిని ఎదుర్కొంది.వై నాట్ కుప్పం అంటూ ఆరోజు.. చేసిన దానికి వై నాట్ పులివెందుల అంటూ వీళ్లు బదులిచ్చారు.

# జగన్ మైండ్ గేమ్ స్టార్ట్...

గుంటూరు, ఆగస్టు 16, వైసీపీ అధినేత జగన్ మైండ్ గేమ్ మొదలుపెట్టినట్లే కనపడుతుంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నుంచి బీజేపీని దూరం చేయడానికి అవసరమైన విధంగా ఆయన అడుగులు పడుతున్నట్లే ఉంది. సాధారణంగా పోలింగ్ లో తేడాలుంటే ఎన్నికల కమిషన్, బీజేపీపై జగన్ విమర్శలు చేయాల్సి ఉంది. అయితేవాటిని పక్కనపెడుతూ ఓటు చోరీ పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీపై ఆయన మండిపడుతుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఎందుకంటేరాహుల్ గాంధీ బీహార్, మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలను ప్రస్తావించారు కానీ, ఆంధ్రప్రదేశ్ లో 12.5 శాతం పోలింగ్ ఓట్లతో తేడా వచ్చినప్పటికీ దాని ప్రస్తావన లేకపోవడాన్ని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ అగ్రనేత



రాహుల్ గాంధీతో హాట్ లైన్ లో టచ్ లో ఉన్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. ఇందుకు పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకరించాని కూడా అన్నారు. దీన్ని బట్టి చూస్తే చంద్రబాబు రాహుల్ తో టచ్ లో ఉన్నారంటూ జగన్ చేసిన ప్రయత్నం రాజకీయంగా మైండ్ గేమ్ అని చెప్పాల్సి ఉంటుంది. ఎందుకంటే బీజేపీ, కాంగ్రెస్ లు రానున్న ఎన్నికల్లో తలపడుతున్న సందర్భంలో మరొకసారి చంద్రబాబుతో బీజేపీ చేతులు కలపకుండా చేయకుండా ఉండేదుకు ఈ రకమైన ఆరోపణలు చేస్తున్నట్లు టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మాణికం ఠాగూర్ పై కడా జగన్ విమర్శలు చేశారు.. మాణికం ఠాకూర్ చంద్రబాబు నాయుడును విమర్శించడం లేదని, ఆయన ప్రభుత్వంలో జరిగే అవినీతిని ఎత్తి చూపడం లేదని, ఏపీలో అధికారంలో ఉన్న పార్టీని వదిలేసి ప్రతిపక్షంలో ఉన్న తమపై విమర్శలు చేయడమంటే లోపాయి కారీ ఒప్పందం ఏమిటో అర్థమవుతుందని వైఎస్ జగన్ వ్యాఖ్యానించడం రాజకీయ ఎత్తుగడల్లో ఒక భాగమేనంటున్నారు. బీజేపీతో చంద్రబాబును దూరం చేస్తే తప్ప తనకు తిరిగి అధికారం దక్కదని భావించిన జగన్ ఇక ఇటీవల ఈ తరహా రాజకీయం మొదలుపెట్టారని టీడీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. గతంలో తెలంగాణలో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుని రాహుల్ గాంధీతో ప్రచారంలో పాల్గొన్న ఫొటోలను కూడా వైసీపీ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారంటే ఆ దిశగా ప్రయత్నాలు జగన్ పార్టీ మొదలు పెట్టినట్లే అనుకోవాల్సి ఉంటుంది

# అంత అన్నారు... ఇంత అన్నారే...

కడప , ఆగస్టు 16, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కడప జిల్లాలో క్యాంప్ కార్యాలయం పెడతానని దాదాపు కొన్ని నెలలు గడుస్తుంది. అయితే ఇప్పటి వరకూ కడప జిల్లాలో క్యాంప్ కార్యాలయం పెట్టింది లేదు. ఆయన వెళ్లింది లేదు. ఈ ఏడాది జనవరిలో ఆయన కడపలో పర్యటించిన సందర్భంగా చేసిన ప్రకటన ప్రకటనకే పరిమితమయినట్లుగా కనపడుతుంది. దాదాపు తొమ్మిది నెలలు గడుస్తున్నా కడపలో క్యాంప్ కార్యాలయం పెట్టలేదు. పవన్ కల్యాణ్ ఆ ఊసే మర్చిపోయినట్లుంది. తాను ప్రజల్లోకి వెళ్లి బహిరంగంగా చేసిన ప్రకటనను కూడా పట్టించుకోకపోవడం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమయింది. కడప ప్రాంతంలో పర్యటించినప్పుడు ఉండే జోష్ తర్వాత పవన్ కల్యాణ్ లో ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నకు మాత్రం జవాబు లేదు.మాటకు కట్టుబడి ఉండేలా... అన్నమయ్య జిల్లాలోని గాలివీడు తహశీల్దారును పరామర్శించడానికి కడప వెళ్లిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఊరమాస్ వార్నింగ్ ఇచ్చారు. అయితే తర్వాత మాత్రం ఆ మాస్ వార్నింగ్ ను కడప సరిహద్దుల్లోనే వదిలేసినట్లుందని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పవన్ కల్యాణ్ ఏదైనా ఆ సమయంలో చెప్పిన మాటకు కట్టుబడి ఉండరని, అక్కడ పరిస్థితులను బట్టి తన మనసులో తోచిన విషయాన్ని ఆవేశంగా బయటకు చెబుతారని, అంతే తప్ప ఆచరణ సాధ్యం కాని విషయాలను కూడా చెప్పి జనం ముందు నవ్వుల పాలు అవుతున్నారని జనసైనికులే అంటున్నారు. అందుకే ఒక మాట చెప్పేముందు అన్నీ ఆలోచించుకుని చేయాల్సి ఉంటుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.గతంలోనూ పవన్ కల్యాణ్ చేసిన అనేక వ్యాఖ్యలు, హామీలను కూడా వైసీపీ సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. పవన్ కల్యాణ్ మాటలపై నమ్మకం కలగాలంటే కనీసం తాను చెప్పిన మాటలను అయినా నిజం చేయాలని, కనీసం కడపలో క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి ఉన్న అభ్యంతరాలేమిటి? అని జనసైనికులే ప్రశ్నిస్తున్నారు. అందుకే పవన్ కల్యణ్ ఇకపై ఒక మాట మాట్లాడేటప్పుడు ఆచరణ సాధ్యమా? తన కున్న పరిధిలో అది వీలవుతుందా? అన్నది ఆలోచించుకోవాలంటున్నారు.

# పీపీపీ ద్వారా 11 రోడ్లు

విజయవాడ, ఆగస్టు 11, రాష్ట్రంలోని కొన్ని ప్రధాన రహదారులను ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. పీపీపీ విధానంలో రహదారుల విస్తరణతో పాటు పలు అభివృద్ధి, మౌలిక సౌకర్యాల ప్రాజెక్టుకు చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో టెక్నో-ఎకనామిక్ స్టడీ చేయించగా, తొలుత 11 రహదారుల్లో ఈ విధానాన్ని అమలు చేయవచ్చని స్పష్టం చేసింది. వారు ఈ అధ్యయనంలో వివిధ అంశాలను పరిశీలించారు. వాటిలోని అంశాలు ఏంటంటే.. రహదారి విస్తరణకు అవసరమైన వరుసల సంఖ్య, ఖర్చు ఎంత అవుతుంది?. కేంద్ర, రాష్ట్రాల వంతు వ్యయభారం ఎంత. గుత్తేదారులకు ఎంతకాలం టోల్ వసూలు హక్కులు ఇవ్వాలి అనే అంశాలు పరిశీలించారుఈ 11 రహదారులను 15 నుంచి 30 సంవత్సరాల వరకు నిర్వహణ, టోల్ వసూలు హక్కులతో గుత్తేదారులకు అప్పగించేందుకు ప్రతిపాదన చేశారు. అయితే, మరో 6 రహదారుల కోసం పీపీపీ మోడల్ ఆదాయపరంగా చెల్లుబాటు కావడం లేదని అధ్యయనంలో తేలింది.

ప్రత్యేక రహదారి ప్రాజెక్టుల వివరాలు:

మంగళగిరి - తెనాలి - నారకోడూరు (39 కిలో మీటర్లు).. గుంటూరు - బాపట్ల (50 కిలో మీటర్లు)

ఈ రెండు రహదారులను ఒక్కొక్కటిగా కాకుండా, ఒకే ప్రాజెక్టుగా కలిపి నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రతిపాదన.

మొత్తం ఖర్చు: రూ. 1,529.21 కోట్లు.

నరసాపురం - తాడేపల్లిగూడెం - అశ్వరావుపేట (92.4 కిలో మీటర్లు): ఇందులో నరసాపురం నుంచి తాడేపల్లిగూడెం వరకు 51 కిలో మీటర్లు మాత్రమే పీపీపీ ద్వారా అభివృద్ధి చేయడం సాధ్యమని తేలింది.

అంచనా ఖర్చు: రూ. 419 కోట్లు.

బైపాస్‌లు: మార్టేరు వద్ద 2.3 కిలో మీటర్లు, అత్తిలి వద్ద 3.47 కిలో మీటర్లు, పిప్పర వద్ద 3 కిలో మీటర్లు, పెంటపాడు వద్ద 4.3 కిలో మీటర్లు.

ఒంగోలు - పొదిలి (50 కిలో మీటర్లు).. పొదిలి - బెస్తవారిపేట (59 కిలో మీటర్లు):

పొదిలి - బెస్తవారిపేట విస్తరణ పీపీపీ ద్వారా సాధ్యంకాదని తేలినా, మొత్తం 109 కిలో మీటర్లు ప్రాజెక్టుగా కలిపి విస్తరిస్తే సాధ్యమేనని సూచించారు.

అంచనా వ్యయం: రూ. 611 కోట్లు.

బైపాస్‌లు: సంతనూతలపాడు వద్ద 2 కిలో మీటర్లు, చీమకుర్తి వద్ద 5.4 కిలో మీటర్లు.

పీపీపీ విధానంలో విస్తరణకు అనుకూలమైన రహదారులు

మార్గం, కి.మీ, లేన్లు, అంచనా వ్యయం వివరాలిలా..

ఒంగోలు-పొదిలి- బెస్తవారిపేట - 109 కి.మీ, లేన్లు 4/2, అంచనా వ్యయం రూ.611 కోట్లు

మంగళగిరి- తెనాలి- నారాకోడూరు, గుంటూరు-బాపట్ల, 89 కి.మీ, లేన్లు 4, అంచనా వ్యయం రూ. 1,529.21 కోట్లుచిలకపాలెం-రామభద్రపురం- రాయగడ రోడ్ 131 కి.మీ, లేన్లు 2/4, అంచనా వ్యయంరూ.1,172 కోట్లు

దామాజీపల్లి-నాయనపల్లి 60 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.338 కోట్లు

కాకినాడ- రాజమహేంద్రవరం కెనాల్ రోడ్ 60 కి.మీ, లేన్లు 4, అంచనా వ్యయం రూ.680 కోట్లు

ప్యాపిలి- బనగానపల్లి 54 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.171 కోట్లు

నరసాపురం- తాడేపల్లిగూడెం- 51 కి.మీ, లేన్లు 4, అంచనా వ్యయం రూ.419 కోట్లు

నర్సీపట్నం- తాళ్లపాలెం 31 కి.మీ, 2, అంచనా వ్యయం రూ.101 కోట్లు

జమ్మలమడుగు-కొలిమిగుండ్ల 42 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.181 కోట్లు

సోమందేపల్లి-హిందూపురం- తూముకుంట 39 కి.మీ, లేన్లు 2/4, అంచనా వ్యయం రూ.270 కోట్లు

కాకినాడ- జొన్నాడ రోడ్ 4 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.425 కోట్లు

పీపీపీ కింద రోడ్ల విస్తరణ సాధ్యం కాని ప్రాజెక్టులు

- కళింగపట్నం- శ్రీకాకుళం పార్వతీపురం రోడ్డు 108 కి.మీ, లేన్లు 2/4, అంచనా వ్యయం రూ.587 కోట్లు
- ఏలూరు- జంగారెడ్డిగూడెం 51 కి.మీ, 2 లేన్లు, అంచనా వ్యయం రూ.250 కోట్లు
- రాజంపేట- గూడూరు 94 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.230 కోట్లు
- ఏలూరు- మేడిశెట్టివారిపాలెం రోడ్డు 70 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.403 కోట్లు
- విజయనగరం- పాలకొండ రోడ్డు 70 కి.మీ, లేన్లు 4/2, రూ. 642 కోట్లు
- గుంటూరు- పర్చూరు 41 కి.మీ, లేన్లు 2, అంచనా వ్యయం రూ.147 కోట్లు

# టీడీపీది బలమా..బలుపా...

కడప, ఆగస్టు 16, పులివెందుల జడ్పీటీసీని అధికార టీడీపీ కైవశం చేసుకుంది. ఇది జగన్‌కు ఎదురు దెబ్బ అని వైసీపీ మరింత నీరసించిపోతుందని టీడీపీ శ్రేణులు సంబరపడుతున్నాయి. పులివెందుల గడ్డా ఇకపై జగన్ అడ్డా కాదని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే సీన్ రిపీట్ అవుతుందని జోస్యం చెబుతున్నాయి. ఇదంతా దొంగ ఓట్లతో సాధించిన విజయమని కచ్చితంగా నిజమైన ఓట్లతో తాము గెలిచి చూపిస్తామని వైసీపీ శపథం చేస్తోంది. ఇంతకీ ఈ విజయాన్ని ఎలా చూడాలి. ఇది టీడీపీ బలానికి ప్రతీకనా లేకా కేవలం వాపేనా అనేది పరిశీలిద్దాం. పులివెందుల అంటేనే వైఎస్ కుటుంబానికి అడ్డా. పార్లమెంట్ ఎన్నికల నుంచి సర్పంచ్ ఎన్నికల వరకు ఆ ఫ్యామిలీయే శాసిస్తుంది. వారు ఎవర్ని నిలబెడితే వాళ్లకే జనం ఓట్లేస్తారు. ఇది అక్కడ ప్రజల ప్రేమాభిమానాలకు నిదర్శనమని వైసీపీ నేతలు చెబుతుంటారు. కానీ అక్కడ ప్రజలకు స్వేచ్ఛ లేకుండా భయపెట్టి ఇలాంటి ప్రొజెక్షన్ ఇస్తుంటారని ప్రత్యర్థుల ఆరోపణ. ఏమైనా సరే ఇప్పటి వరకు వైఎస్ కుటుంబాన్ని దాటి వేరే వ్యక్తులు ఆ ప్రాంతంలో గెలించింది లేదు. అలానే జడ్పీటీసీ కూడా ఆ కుటుంబ ఆధిపత్యం సాగుతూ వచ్చింది. కానీ తొలిసారి ఈ ఉపఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరింది. దాదాపు 30 ఏళ్ల తర్వాత పులివెందుల జడ్పీటీసీలో సైకిల్ బెల్ మోగింది. దశాబ్ధాలుగా కొనసాగుతున్న వైఎస్ కుటుంబ ఆధిపత్యానికి ఇది ఎదురుదెబ్బే అనొచ్చు. పులివెందుల జడ్పీటీసీగా ఉన్న తుమ్మల మహేశ్వర్‌రెడ్డి 2023లో ఓ ప్రమాదంలో మృతి చెందారు. అందుకే ఈ స్థానం కోసం ఉప ఎన్నిక జరిగింది. అధికారంలో ఉన్న టీడీపీ, అధికారం కోల్పోయిన వైసీపీ రెండు పార్టీలు కూడా ఈ పులివెందల జడ్పీటీసీ ఉపఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. హోరాహోరీగా ప్రచారం చేశాయి. ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. పులివెందుల గడ్డ వైసీపీ అడ్డా అంటూ ఆపార్టీ రాష్ట్ర స్థాయి నేతలంతా వచ్చి ప్రచారం చేశారు. పులివెందుల అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి వ్యూహాన్ని ఈ ఎన్నికల నుంచే అమలు చేయాలని భావించి టీడీపీ అందుకు తగ్గట్టుగా ప్లాన్ చేసింది. ఈ ఎన్నికల పూర్తి బాధ్యతను ఇద్దరు మంత్రులు, ఇతర సీనియర్ నేతలపై పెట్టింది. నిత్యం వారు పులివెందుల ప్రజల్లోనే ఉంటూ గెలుపు ప్రణాళికలను అమలు చేసారు. జగన్‌కు వ్యతిరేకంగా ఉన్న వర్గాలను చేరదీశారు. వైఎస్ కుటుంబంలోనే జగన్ అంటే పడని వారిని తమవైపు తిప్పుకున్నారు. ఇలా ఆరు నెలలుగా అక్కడ ఆపరేషన్ పులివెందుల చేపట్టారు. అందుకు తగ్గ ఫలితాన్ని రాబట్టారు. అధికారులను, పోలీసులను విచ్చలవిడిగా పార్టీ కార్యకర్తల మాదిరిగా వాడుకున్న టీడీపీ పులివెందులలో అరాచకంగా ఎన్నికలు నిర్వహించిందని వైసీపీ ఆరోపించింది. నిజమైన ఓటర్లు ఓట్లు వేసుకోలేని విధంగా బూత్ క్యాప్చర్ చేసిందని మండిపడింది. అందుకు తగ్గట్టుగానే కొందరు వ్యక్తులు మీడియాతో మాట్లాడించారు. అటు టీడీపీ కూడా వాళ్లకు కౌంటర్ ఇచ్చింది. దశాబ్ధాలుగా ప్రజలను, నాయకులను బెదిరించి ఏకగ్రీవాలు చేసుకుంటూ వచ్చిన వైసీపీ ఇప్పుడు ఎన్నికలు జరుగుతుంటే తట్టుకోలేకపోతోందని మండిపడింది. వైసీపీ అరాచకాలను పోలీసులు అడ్డుకోవడంతో ప్రజలంతా ప్రశాంతంగా వచ్చి ఓటు వేశారని అన్నారు. ఇంకా చాలా మంది రావాల్సి ఉండేదని కానీ వైసీపీ నేతల బెదిరింపులకు భయపడిపోయారని అంటోంది. పులివెందులలో టీడీపీ అరాచకాలు చేస్తోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలకు గతాన్ని గుర్తు చేస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ప్రాంతంలో కూడా ప్రత్యర్థులు కనీసం నామినేషన్ వేసే అవకాశం లేకుండా చేశారని చెబుతున్నారు. నాడు వైసీపీ నేతలు చేసింది తక్కువ కాదని చెబుతున్నారు. నాడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచారానికి వెళ్లినా కూడా రానివ్వకుండా చేసిన విషయాన్ని మర్చిపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. పులివెందులలో విజయం సాధించిన టీడీపీ వచ్చే ఎన్నికలలో అసెంబ్లీలో గెలుస్తామని చెప్పడం అతి విశ్వాసం అవుతుంది. ఎందుకంటే గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వైసీపీ ఇలాంటి ప్రయత్నం చేసి బోల్తా పడింది. కుప్పంలో అన్ని లోకల్ బాడీ ఎన్నికల్లో విజయం సాధించింద. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోతారని ప్రచారం చేసింది. అప్పుడు మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్కడే మకాం వేసి చంద్రబాబును దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. కానీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి సీన్ తిరిగబడింది. కుప్పంలో కాదు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీని ప్రజలు తిరస్కరించారు. కేవలం 11 సీట్లే కట్టబెట్టారు. ఆ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తు పెట్టుకొని మసులుకోవాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల జయాపజయాలు కేవలం స్థానికంగా ఉండే రాజకీయ సమీకరణాలను ఆధారంగా చేసుకొని ఉంటాయి. అంతే కాకుండా అధికారంలో ఉన్న పార్టీకి కొద్దోగొప్ప అనుకూలంగా ఉంటాయి. అంత మాత్రాన నాలుగేళ్ల తర్వాత జరగబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తామని చెప్పుకోవడం అతి విశ్వాసం అవుతుంది. ఈ దెబ్బకు వైసీపీ ఢీలా పడుతుందని ఆ పార్టీ పని అయిపోయిందనే ఆలోచన సరికాదని అంటున్నారు. గత లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా టీడీపీ పని అయిపోయిందని వైసీపీ నేతలు స్టేట్మెంట్‌లు పాస్ చేశారు. ఇప్పుడు వారంతా ఏ పరిస్థితుల్లో ఉన్నారో అందరికీ తెలిసిందే. ఈ విజయం మెట్టుగా ఉపయోగపడుతుంది. అలానే చూడాలని అంటున్నారు

## జంతు ప్రేమికుల వల్లే కుక్కలకు కుట్లు ఆలస్యం




---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 18- జంతు ప్రేమికుల వల్లే కుక్కల కూనీ ఆపరేషన్లు ముందుకు సాగడం లేదని అధికారులు అంటున్నారు. ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ మరమ్మతులకు మున్సిపల్ నిధుల నుంచి మూడు లక్షల అరవై వేలతో మరమ్మతులు చేపట్టామని కానీ పట్టణంలో ఉన్న జంతుప్రేమికుల వల్ల కుక్కల కుట్లు వేయడం ఆలస్యం అవుతుందని అధికారులు ఆరోపిస్తున్నారు. 20-21 సంవత్సరం లో 746- కుక్కలకు కుట్లు వేశామని అంటున్నారు. అలాగే 2022 సంవత్సరం లో 376 కుక్కలకు కుట్లు వేశామని అంటున్నారు . గత మూడు సంవత్సరాల నుంచి కుక్కల కుట్లు వేయడం మానేశారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు . నంద్యాల పట్టణ వాసులను శునకాలు భయ పెడుతున్నాయని. చిన్నారులకు ఒంటరిగా బయటకు వెళ్లలేని పరిస్థితి. రాత్రి వేళ పెద్దవాళ్లూ జంకుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంటపడి కరిచేస్తున్నాయని పట్టణ వాసులు ఆరోపణలు చేస్తున్నారు . ఇలా కుక్క కాటు బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది . పట్టణంలో ఎక్కడా పూర్తి స్థాయిలో లెక్కింపు పనులు చేపట్ట లేదు. పైపై లెక్కలు ప్రకారం పట్టణంలో 15 వేలు కుక్కలు ఉన్నట్లు పశు సంవర్ధన శాఖ లెక్కల ప్రకారం తేల్చారు .గతంలో కుక్కలకు గర్భధారణ నియంత్రణ శస్త్రచికిత్సల పేరుతో మున్సిపాలిటీ లో నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి . ఒక్కో శునకానికి రూ. 1000-1350 వ్యయ చేశారు. వీటికి లెక్కలు లేకపోవడం తనిఖీలు లేక పోవడంతో లక్షలు పక్కదారి పట్టించారని గుసగుసలు వినిపిస్తున్నాయి . యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ నిర్వహించాలి . కుక్కల నియంత్రణకు మున్సిపల్ యంత్రాంగం ఎప్పుడు అడుగులు వేస్తుందోనని పట్టణ వాసులు ఎదురు చూస్తున్నారు.

## మాజీ ప్రదాన మంత్రి కి ఘన నివాళులు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 16- నంద్యాల అర్బన్ భారతీయ జనతా పార్టీ రైతునగర్ కార్యాలయం లో కోట్లాదిమందికి మార్గదర్శి స్ఫూర్తిదాత మాజీ ప్రధానమంత్రి భారతరత్న అవార్డు గ్రహీత శ్రీ అటల్ బిహారి వాజ్పేయి గారి వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దలు సీనియర్ నాయకులు . బి. వి. సుబ్బారెడ్డి .. శివ నరసింహ గౌడ్.. మహేశ్వరరెడ్డి.. ప్రసాద్ రాజు.. మండ్ల గంగాధర్.. తాడి రామకృష్ణారెడ్డి.. మోహన్ రెడ్డి.. సాంబశివుడు.. శ్రీనివాసరెడ్డి.. వేణుగోపాల్ రెడ్డి.. తదితరులు పాల్గొన్నారు.

### మండల కేంద్రంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.

తుగ్గలి:మండల కేంద్రమైన తుగ్గలిలోని రామాలయం వీధి నందు శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు శ్రీ కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా మొదటి రోజైన శనివారం రోజున ఉదయాన్నే పూజా మండపంలో శ్రీకృష్ణుని ప్రతిమలకు పూలతో చక్కగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రజలు పూజలను నిర్వహించారు. అనంతరం భగవద్గీతను పఠనం చేస్తూ విలువైన సందేశాలను వారు భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ఆదివారం రోజున మధ్యాహ్నం రెండు గంటల నుండి శ్రీకృష్ణుని ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. గ్రామ పురవీధుల్లో భక్తుల దర్శనార్థం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగింపును నిర్వహిస్తున్నట్లు ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలియజేశారు.

## ఆంధ్ర రైతోధ్యమ రధ సారథి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న---




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 16-నంద్యాల జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా పోలీస్ కార్యాలయం నందు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న గారి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో శ్రీకాకులం జిల్లాలో గౌతు లచ్చన్న ప్రజలందరికీ దిక్సూచిగా నిలిచారు. గౌతు లచ్చన్న గారు ప్రజల పక్షాన ఎల్లప్పుడూ నిలబడ్డ మహనీయుడు. ఆయన జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకం. “దేశ స్వాతంత్ర్యం కోసం మాత్రమే కాక, రైతు?కూలీల సంక్షేమం కోసం చేసిన పోరాటం గౌతు లచ్చన్న గారి మహోన్నత యక్తి అని కొనియాడారు. గాంధీ సిద్ధాంతాలను, మార్గాలను ఆదర్శాలను ఆకర్షితుడై స్వాతంత్ర పోరాటంలో భాగంగా అనేక ఉద్యమాల్లో పాల్గొని జైలుకు వెళ్లారని నిజాయతి పరుడైన మంచి రాజకీయ నాయకుడిని అనేక మార్లు లోక్ సభకు ఎన్నికయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు మోహన్ రెడ్డి,సూర్య మౌళి. ఇన్స్పెక్టర్ లక్ష్మయ్య రిజర్వు ఇన్స్పెక్టర్లు మంజునాథ్, సురేష్ బాబు, రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్లు ,జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది మరియు ఏ ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న


-- స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 16-ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు అండ్ భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

## అన్న దాత సుఖీభవానికి పెద్ద పీట----

మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 16-నంద్యాలలో లో అన్నదాత సుఖీభవ కు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని. సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా చంద్రన్న పాలన కొనసాగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం నిధులను మంజూరు చేయడంతో శనివారం మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో స్థానిక టేక్కే మార్కెట్ యార్డ్ నుంచి శ్రీనివాస్ సెంటర్ మీదుగా సంజీవనగర్ గేట్ మున్సిపల్ ఆఫీస్ నుంచి పద్మావతి నగర్ రోడ్డు వరకు రైతులు ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. .సుమారు 200 ట్రాక్టర్లతో నంద్యాలలోని టేక్కే మార్కెట్ యాడ్ నుంచి ర్యాలీ ప్రారంభించారు . ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ చంద్రన్న పవన్ అన్న నరేంద్ర మోడీ సుఖీభవ’ అంటూ ట్రాక్టర్ల ర్యాలీపై హోరెత్తించారని. ఎన్నికల హామీ నిలబెట్టుకుని అన్నదాత సుఖీభవ పథకం కింద తొలివిడతగా రూ. 7వేలు చొప్పున జమ చేసిన సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారని అన్నారు. ‘వైసీపీ పాలనలో రైతులు అడుగుడునా దగా పడ్డారని.



అన్నదాతకు ఇచ్చిన మాట మేరకు సీఎం చంద్రబాబునాయుడు ధాన్యం కొనుగోలు సమయంలో 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని. వరి, అరటి, మామిడి, మొక్కజొన్న సాగు చేసిన రైతులను ఆదుకుంటున్నామని . అన్నదాత సుఖీభవ పథకం అమలుతో రైతుల్లో పండుగ వాతావరణం నెలకొంది అన్నారు. 15 నుంచి మహిళలకు ఉచిత స్త్రీ బస్సు పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. అనంతరం ట్రాక్టర్ ర్యాలీ విజయవంతం చేసిన రైతులందరికీ మరియు నియోజకవర్గ మండలాల కూటమి నాయకుల కు, కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు తెలియజేశారుఈ కార్యక్రమంలో నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి , గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , కేసీ కెనాల్ చైర్మన్ చాబోలు ఇలియాస్ లతో పాటు మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ టిడిపి అధ్యక్షులు, నంద్యాల టిడిపి కౌన్సిలర్లు , మాజీ కౌన్సిలర్లు , పట్టణ నాయకులు కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ సర్ధార్ గౌతు లచన్న జయంతి సందర్బంగా నంద్యాల జిల్లా పోలీసు కార్యలయం నందు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.




జాతీయ స్వాతంత్రోద్యమ యోధుడు ఆంధ్ర రైతోధ్యమ రధ సారథి బడుగు బలహీన వర్గాల నాయకుడు

నంద్యాలనంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఐపీస్ ఆదేశాలమేరకు జిల్లా పోలీస్ కార్యాలయం నందు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో శ్రీకాకులం జిల్లాలో గౌతు లచ్చన్న ప్రజలందరికీ దిక్సూచిగా నిలిచారు. గౌతు లచ్చన్న ప్రజల పక్షాన ఎల్లప్పుడూ నిలబడ్డ మహనీయుడు. ఆయన జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకం. “దేశ స్వాతంత్ర్యం కోసం మాత్రమే కాక, రైతు?కూలీల సంక్షేమం కోసం చేసిన పోరాటం గౌతు లచ్చన్న మహోన్నత యక్తి అని కొనియాడారు. గాంధీ సిద్ధాంతాలను, మార్గాలను ఆదర్శాలను ఆకర్షితుడై స్వాతంత్ర పోరాటంలో భాగంగా అనేక ఉద్యమాల్లో పాల్గొని జైలుకు వెళ్లారని నిజాయతి పరుడైన మంచి రాజకీయ నాయకుడిని అనేక మార్లు లోక్ సభకు ఎన్నికయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు మోహన్ రెడ్డి,సూర్య మౌళి పీజీ ఆర్ఎస్ ఇన్స్పెక్టర్ లక్ష్మయ్య రిజర్వు ఇన్స్పెక్టర్లు మంజునాథ్, సురేష్ బాబు, రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్లు ,జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది మరియు ఏ ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## యాగంటి ఆలయంలో ప్రత్యేక పూజలు...

-మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి

బనగానపల్లె..బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైనయాగంటి, శ్రీ ఉమామహేశ్వర స్వామి వారిని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి శనివారం నాడు స్వాములవారిని దర్శించుకున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి



సందర్భంగా అష్టమి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు బిసి ఇందిరా రెడ్డి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వర్ రెడ్డి, ఈఓ పాండురంగా రెడ్డి, భరతుడు, టిడిపి యువ నాయకులు సంగు శంకేశ్వర రెడ్డి, బత్తుల నారాయణరెడ్డి,మల్లేష్ రెడ్డి, రామశేఖర్, మహేష్ రెడ్డి , అర్చకులు, ఆలయ సిబ్బంది రమేష్ బాబు పాల్గొన్నారు.

## బురద దారిలో బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు...

ఆలూరు..బురదమయంగా నిట్రవట్టీ రోడ్డుఅధ్వానంగా నిట్రవట్టి దారులో పడి లేస్తూ పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులుఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న రోడ్డు సమస్యప్రజా ప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యంహోలహర్వి మండలంలోని నిట్రవట్టి దారులు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా తయారైంది. గ్రామంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయం దారి బురదమయంగా మారింది. గ్రామం నుంచి పచ్చారపల్లి, బాపురం గ్రామాలకు ఈ దారి గుండానే ప్రయాణిస్తారు. బురదమయంగా మారిన ఈ మార్గం గుండా రాకపోకలు సాగించడానికి గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగించే అవకాశం లేకుండా ఉందని వాపానచోదకులు వాపోతున్నారు. ఈ గ్రామంలో రామలింగేశ్వర స్వామి దేవాలయంనికి రహదారి సౌకర్యం లేదు. ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు గోతులతో అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు



బురదమయంగా తయారైంది. దీంతో రోగులను ఆస్పత్రికి తరలించాలన్నా గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు బురదలో నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాలు కురుస్తున్నప్పుడు నీరు వెళ్లలేని పరిస్థితి ఉంది. భారీ వర్షాలు కురిస్తే ఈ రెండు గ్రామాల ప్రజలు మట్టి రోడ్డులో వెళ్లే అవకాశం లేక ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ గ్రామంలో పక్కా రోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190